ఉప్పుగప్పురంబు నొక్కపోలికనుండు
చూడచూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్య పురుషులువేరయ

విశ్వదాభి రామ వినుర వేమ

ఆత్మ శుద్ధిలేని యాచార మదియేల
భాండ సుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా

విశ్వదాభి రామ వినుర వేమ

అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను
సజ్జనుండు పలుకు చల్లగాను
కంచుమ్రోగినట్లు కనకంబుమ్రోగునా
విశ్వదాభిరామ వినురవేమ.

అనగ ననగ రాగ మతిశయిల్లుచునుండు
తినగ తినగ వేము తీయగనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన

విశ్వదాభి రామ వినుర వేమ

గంగిగోవు పాలు గరిటడైనను చాలు
కడివెడైన నేల ఖరముపాలు
భక్తికలుగు కూడు పట్టెడైననుజాలు
విశ్వదాభిరామ వినుర వేమ

ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు

కాచి యతుకనేర్చు గమ్మరీడు
మనసు విరిగినేని మరియంట నేర్చునా?
విశ్వదాభిరామ వినురవేమ

ఎలుకతోలు తెచ్చి యెన్నాళ్ళు నుదికిన
నలుపు నలుపేకాని తెలుపు కాదు
కొయ్యబొమ్మనుదెచ్చి కొట్టిన పలుకునా?
విశ్వదాభిరామ వినురవేమ

చిప్పలోనబడ్డ చినుకు ముత్యంబయ్యే
నీట బడ్డ చినుకు నీట గలిసె
బ్రాప్తి గలుగు చోట ఫలమేల తప్పురా
విశ్వదాభిరామ వినురవేమ

చిక్కియున్న వేళ సింహంబునైనను
బక్కకుక్క కరచి బాధచేయు
బలిమి లేనివేళ బంతంబు చెల్లదు
విశ్వదాభిరామ వినురవేమ

అనువుగాని చోట అధికులమనరాదు
కొంచమయిన నదియు కొదువగాదు
కొండ అద్దమందు గొంచమై నుండదా
విశ్వధాభిరామ వినురవేమ

కుండ కుంభమన్న కొండ పర్వతమన్న

నుప్పు లవణమన్న నొకటి కాదె
భాషలిట్టె వేరు పరతత్వమొకటె
విశ్వధాభిరామ వినురవేమ

తప్పులెన్ను వారు తండోపతండమ్ము
లుర్వి జనులకెల్ల నుండు తప్పు
తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు
విశ్వధాభిరామ వినురవేమ

అక్కరకురాని చుట్టము,
మ్రొక్కిన వరమీన వేల్పు, మోహరమునదా
నెక్కిన బాఱని గుఱ్ఱము,
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ.

అప్పిచ్చువాడు, వైద్యుడు,
నెప్పుడు నెడతెగక బాఱు నేఱును, ద్విజుడున్
జొప్పడిన యూర నుండుము,
చొప్పడకున్నట్టి యూరు నొరకుము సుమతీ.

కనకపు సింహాసనమున
శునకము గూర్చుండబెట్టి శుభ లగ్నమునం
దొనరగ బట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ.

ఎప్పుడు సంపద కలిగిన
నప్పుడు బంధువులు వత్తు రది యెట్లన్నన్
తెప్పలుగ జెఱువు నిండిన

గప్పలు పదివేలు చేరు గదరా సుమతీ.

ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగా;
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ.

ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి, యన్యుల మనముల్
నొప్పించక, తా నొవ్వక,
తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ.

కమలములు నీట బాసిన
కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్
తమ తమ నెలవులు దప్పిన
తమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ.

అడిగిన జీతంబియ్యని
మిడిమేలపు దొరను గొల్చి మిడుకుట కంటెన్
వడిగల యెద్దుల గట్టుక
మడి దున్నుకు బ్రతుక వచ్చు మహిలో సుమతీ